సాక్షి
నిర్మల్
ఆదివారం । 16 । జూన్ । 2024

నాన్నకు ప్రేమతో..

ప్రపంచంలో అందమైన పదం అమ్మ... మధురమైన పిలుపు నాన్న.. అమ్మ జన్మనిస్తుంది. నాన్న జీవితాన్నిస్తాడు. అమ్మ నిజం.. నాన్న నమ్మకం.. బిడ్డల కోసం తన సంతోషాలను త్యాగం చేసేది.. పిల్లల భవిష్యత్ కోసం పరితపించే వ్యక్తి నాన్న. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా కథనం.

– వివరాలు 8లో



గరిష్టం/కనిష్టం
35.5 /27.7


వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేధిస్తే ఫిర్యాదు చేయాలి

• ఎస్పీ జానకీ షర్మిల



ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మహిళలు, యువతులు, బాలికలు ఏ విధమైన వేధింపులకు గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా మే నెలలో 1 ఫిర్యాదు రాగా పిలిపించి కౌన్సెలింగ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు షీటీం ఆధ్వర్యంలో 12 అవగాహన సదస్సులు నిర్వహించామని తెలిపారు. 144 హాస్పిటల్స్‌ను విజిట్ చేసినట్లు పేర్కొన్నారు. నేరుగా షీటీంను ఈ 8712659550 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

బ్యాంకింగ్ లింకేజీలో అ'ద్వితీయం'



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్‌చైన్‌గేట్: ఇందిరాక్రాంతి పథకంలో భాగంగా బ్యాంకింగ్ లింకేజీలో 2023–24 సంవత్సరానికి నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం నిలిచింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి శిక్షణ సంస్థలోని శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క డీఆర్డీవోకు అవార్డు ప్రదానం చేశారు. జిల్లా బ్యాంకింగ్ లింకేజీ లక్ష్యం రూ.403 కోట్లు కాగా, లక్ష్యానికి మించి రూ.411 కోట్లతో జిల్లా రెండోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.జ్ఞానులు అవార్డు అందుకున్నారు. మహిళా సంఘాలకు రుణాలు అందించిన తర్వాత తిరిగి బ్యాంకులకు చెల్లించడంతో మొండి బకాయి రాష్ట్రంలోనే తక్కువ (ఎన్పీఏ 0.18శాతం) ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య మేనేజర్ డి.శ్రీనివాస్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి గంగమణి, కార్యదర్శి ముస్కు సునీత పాల్గొన్నారు.

ఘనంగా 'భట్టి' పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న నాయుడు సత్యనారాయణ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలను సమతా సుదర్శన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర హస్తకళా కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు దాతలు, నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమతా సుదర్శన్ ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, జెడ్పీటీసీ చిన్నరామయ్య, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, కుంటాల జెడ్పీటీసీ కొత్తపల్లి గంగమణి బుచ్చన్న, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకెట పోశెట్టి, అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బర్కుంట గంగారాం తదితరులు పాల్గొన్నారు.

19న వాహనాల వేలం

భైంసాటౌన్: భైంసా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 19న వేలం వేయనున్నట్లు సీఐ నజీర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో ఉదయం 11.30 గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 50 శాతం ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఇంగ్లిష్ మీడియంవైపు బుడి'బడి' అడుగులు

• ప్రీ ప్రైమరీ విద్యాకేంద్రాలుగా అప్‌గ్రేడ్..
• అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక ఆంగ్లమాధ్యమం
• మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి..
• త్వరలో టీచర్లకు శిక్షణ ఇవ్వనున్న ట్రైనర్లు



జిల్లాలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ప్రీ ప్రైమరీ విద్య ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులోకి రానుండడంతో పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రీ స్కూళ్లుగా అప్‌గ్రేడ్..

అంగన్వాడీ కేంద్రాలను క్రమంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు(ప్రీ స్కూల్)గా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించనుంది. దీనికోసం ప్రభుత్వం జిల్లాల వారీగా అన్ని వివరాలు సేకరించింది. మొదటగా జిల్లాలోని 410 అంగన్‌వాడీ కేంద్రాలను ఇందుకు ఎంపిక చేసింది. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఎంపిక చేశారు. ఈమేరకు పెయింటింగ్ తోపాటు ఇతర పనులు చేస్తున్నారు.

సిలబస్ మార్పు..

ఇక ప్రీ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పుస్తకాల్లో సిలబస్‌ను కూడా మార్చారు. ప్రీస్కూళ్లుగా మార్పు చేసిన కేంద్రాలకు

ప్రాజెక్టుల వారీగా 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు, ఎంపికైన అంగన్‌వాడీల సంఖ్య

ఐసీడీఎస్	విద్యార్థులు	అంగన్‌వాడీ కేంద్రాలు
భైంసా	1380	81
ఖానాపూర్	1889	129
ముధోల్	1048	67
నిర్మల్	2476	133

ఇతర అంగన్‌వాడీ కేంద్రాలకు కొంత వ్యత్యాసం ఉంటుంది. మొదటి విడత ఎంపిక చేసిన కేంద్రాలు విజయవంతంగా కొనసాగితే మిగిలిన కేంద్రాలను కూడా అప్‌గ్రేడ్ చేస్తారు. ఇక ప్రీస్కూళ్లలో చదివే పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా యూనిఫాం అందిస్తుంది.

విద్యా బోధనలో మార్పులు..

ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించి



విద్యార్థులకు అందించే డ్రెస్ మోడల్

ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట, పాటలతో విద్యాబోధన చేస్తున్నారు. ప్రీ స్కూల్‌లో 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలుగా ప్రేరణాత్మక, కృత్యాధార బోధన ఉంటుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఆటపాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, పూర్వ గణితం, రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాల తోపాటు కృత్యాలతో విద్యాబోధన చేస్తారు.



మాస్టర్ ట్రైనర్లతో ప్రీస్కూల్‌పై చర్చిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

ప్రతీనెల 4వ శనివారం ప్రీ ప్రైమరీ విద్యా దినోత్సవం జరిపి నత్యాలు, కార్యక్రమాలను ప్రదర్శిస్తారు.

మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ..

ప్రీ ప్రైమరీ విద్యపై జిల్లా నుంచి 10 మంది మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వీరు ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ప్రాజెక్టు సెక్టార్ల వారీగా 3 రోజుల చొప్పున శిక్షణ ఇస్తున్నారు. ఎంపికైన 410 మంది టీచర్లకు శిక్షణ అందించి ప్రీ ప్రైమరీ విద్యకు సన్నద్ధం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు ప్రయోజనం...

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్‌లో 1,256, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 973, నిర్మల్ జిల్లాలో 926, మంచిర్యాల జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 3 వేలకుపైగా మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం, బాలింతలు, గర్భిణులకు ఆహారం, సరుకుల పంపిణీ వంటివి చేపడుతున్నారు. ఇక ఇప్పుడు నర్సరీ నుంచి ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే అంగన్‌వాడీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రీప్రైమరీ విద్య పేరుతో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమ నర్సరీ విద్యను ప్రారంభించడంపై ఉమ్మడి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో శిక్షణ తేదీలు..

ప్రీప్రైమరీలో శిక్షణ పొందిన 10 మంది మాస్టర్ ట్రైనర్లు ప్రాజెక్టుల వారీగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఖానాపూర్ ప్రాజెక్ట్ పరిధిలో ఈనెల 18, 19, 21 భైంసా ప్రాజెక్ట్ పరిధిలో 25, 26 ,28, ముధోల్ ప్రాజెక్ట్ పరిధిలో జూలై 3, 4, 5 నిర్మల్ ప్రాజెక్ట్ పరిధిలో 9, 10, 11 తేదీలలో శిక్షణ ఇచ్చేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

చిన్నారులకు ప్రయోజనం...



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ విద్యను ఆంగ్ల మాధ్యమంలో అందించనున్నట్లు రాష్ట్ర మంత్రి ప్రకటించడం సంతోషం. పేద చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య ఇంగ్లిష్ మీడియంలో అందడం వల్ల వారి అభ్యసనకు బలమైన పునాది ఏర్పడుతుంది. పాఠశాల విద్యకు ఇది నాందిగా నిలుస్తుంది. ఇప్పటికే ప్రభుత్వం అంగన్‌వాడీలను బలోపేతం చేసేదిశగా అన్ని వసతులు సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు కూడా బలోపేతం అవుతాయి. – బర్కం ప్రసాద, అంగన్‌వాడీ టీచర్, పరిమండల్

మంచి ఆలోచన...



మాలాంటి మధ్యతరగతి కుటుంబాల పిల్ల లు ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ వంటి చదువులకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ సందర్భంలో ఉచిత ఇంగ్లిష్ మీడియం విద్యను అంగన్‌వాడీల ద్వారా అందించనున్నట్లు ప్రకటించడం చిన్నారులకు మంచి ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం గొప్ప విషయం.

– కొట్ల మమత, చించోలి(బి)

త్వరలోనే పుస్తకాలు, కిట్స్..



ప్రీ స్కూల్లో భాగంగా శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ అందించి త్వరలో ప్రారంభిస్తాం. ఇందుకు ప్రభుత్వానికి అన్ని నివేదికలను పంపించాం. మరో రెండు మూడు రోజుల్లో సంబంధిత మెటీరియల్, కిట్స్, పుస్తకాలు, యూనిఫామ్స్ అన్ని కేంద్రాలకు చేరుకుంటాయి. 6,793 మంది చిన్నారులకు లబ్ధి చేకూరుతుంది.

– నాగమణి, జిల్లా సంక్షేమ అధికారి

ఆశిష్ స్థానంలో అభిలాష

• ప్రస్తుత కలెక్టర్ కామారెడ్డికి బదిలీ
• ఆయన స్థానంలో 2018 బ్యాచ్ ఐఏఎస్ నియామకం
• కలెక్టర్‌గా జిల్లాలో తొలిపోస్టింగ్



కలెక్టర్‌గా నియమితులైన అభిలాష అభినవ్

నిర్మల్: లోక్‌సభ ఎన్నికలు ముగియగానే బదిలీలు ఉంటాయని జరుగుతున్న ప్రచారం నిజమైంది. ఊహించినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్‌లను శనివారం బదిలీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌ను కామారెడ్డికి బదిలీ చేసింది. ఆయన స్థానంలో అభిలాష అభినవ్‌ను కలెక్టర్‌గా నియమించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో కలెక్టర్‌గా చేసింది స్వల్పకాలమే అయినా ఆశిష్ సంగ్వాన్ తనదైన ముద్ర వేశారు. ఇక జిల్లాలో తొలి కలెక్టర్‌గా మరో యువ ఐఏఎస్ అభిలాష బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈయనా.. ఎనిమిది నెలలే..

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సైతం జిల్లాలో స్వల్పకాలమే కలెక్టర్‌గా కొనసాగారు. ఆయన గత ఏడాది అక్టోబర్ 13న నియమితులయ్యారు. ఎనిమిది నెలల రెండురోజులు మాత్రమే ఇక్కడ పనిచేశారు. తనకంటే ముందు కలెక్టర్‌గా ఉన్న వరుణ్‌రెడ్డి సైతం ఎనిమిది నెలల తొమ్మిది రోజులు కొనసాగారు. 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ వరుణ్‌రెడ్డి ఎన్నికల సంఘం సూచన మేరకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆశిష్ సంగ్వాన్‌ను నియమించింది.

తనదైన ముద్ర..

ఆశిష్ సంగ్వాన్ జిల్లాలో చేసింది కొంతకాలమైనా తనకంటూ ప్రత్యేకమైన పేరు సంపాదించుకున్నారు. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్ రెండు ఎన్నికలనూ ప్రశాంతంగా పూర్తిచేయించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు, సిబ్బందితో పనిచేయించి గుర్తింపు పొందారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. ప్రస్తుతం వర్షాకాలానికీ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. బడిబాట, ఉపాధి హామీ, ధాన్యం కొనుగోళ్లు ఇలా.. ఏ సందర్భమైనా నిత్యం గ్రామాలకు వెళ్తూ అధికారులను ముందుకు నడిపించారు. రాజకీయాలు, అవినీతికి అతీతంగా కొనసాగిన ఆయన పనిచేసే అధికారులను ప్రోత్సహిస్తూ.. పనిచేయని వారిపై సీరియస్‌గా ఉండేవారని పేరు సంపాదించారు. తన భార్య, నిర్మల్‌లో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసిన వల్లూరి క్రాంతి ప్రస్తుతం సంగారెడ్డిలో ఉండటంతో ఆయన కామారెడ్డికి బదిలీపై వెళ్లినట్లు చెబుతున్నారు.

కొత్త కలెక్టర్ నేపథ్యం..

బిహార్ రాజధాని పట్నా సమీపంలోని షోహసరి పట్టణానికి చెందిన అభిలాష అభినవ్ తండ్రి గోల్‌నాథ్ సర్కార్. ఈయన రిటైర్డ్ ఐపీఎస్. తల్లి కల్యాణి సిన్హా. అభిలాష 2005లో పదో తరగతి పూర్తిచేశారు. 2007లో బొకారోలో ఇంటర్, ఆ తర్వాత 2012 ముంబైలోని ఏసీ పటేల్ కాలేజీలో బీటెక్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) పూర్తిచేశారు. వాలీబాల్ చాంపియన్‌షిప్‌గా సాధించిన ఆమెకు పెయింటింగ్‌పైనా ఆసక్తి ఉంది.

జిల్లాకు మరో యువ ఐఏఎస్..

ఇక మరో యువ ఐఏఎస్ కలెక్టర్‌గా జిల్లాలోనే పోస్టింగ్ తీసుకోబోతున్నారు. 2018వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అభిలాష అభినవ్ జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో జిల్లాలో కలెక్టర్లుగా చేసిన ఐఏఎస్‌లు ముషరఫ్అలీ, వరుణ్‌రెడ్డి, కన్ఫర్డ్ ఐఏఎస్ ప్రశాంతిలతోపాటు ప్రస్తుతం బదిలీపై వెళ్తు న్న ఆశిషసంగ్వాన్ సైతం తొలిసారి కలెక్టర్‌గా జిల్లాలోనే నియమితులయ్యారు. తాజాగా అభిలాష అభినవ్ కూడా ఇక్కడి నుంచే పాలనాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నిర్మల్ జిల్లా గుర్తుండిపోతుంది...



నిర్మల్ జిల్లాలో కలెక్టర్‌గా పనిచేయడం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇక్కడ చేసింది కొంతకాలమే అయినా ఇక్కడి ప్రజలు సహకారం చాలాబాగుంది. అధికారులు, సిబ్బంది, ప్రజల సమష్టి సహకారంతో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తిచేసుకోగలిగాం. అధికారులుగా బదిలీలు సాధారణమే. ఇక్కడ పనిచేసిన కాలం మాత్రం ఎప్పటికీ గుర్తుంటుంది.

– ఆశిషసంగ్వాన్, కలెక్టర్

సివిల్స్‌లో 18వ ర్యాంక్..

అభిలాష పుణేలోని ఐబీఎంలో రెండున్నరేళ్లు ఉద్యోగం చేశారు. అనంతరం ఢిల్లీలో సిండికేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పని చేశారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరయ్యారు.

- తొలిసారి 2014లో యూపీఎస్సీ రాయగా, క్వాలిఫై కూడా కాలేదు.
- రెండోసారి 2016లో 308 ర్యాంక్‌తో ఐఆర్‌ఎస్ సాధించారు.
- నాగ్‌పూర్‌లో ఆదాయపన్ను శాఖ అధికారిగా 9 నెలలు పనిచేశారు.
- ఎలాగైనా ఐఏఎస్ కొట్టాలన్న సంకల్పంతో మూడోసారి 2017లో ఏకంగా సివిల్స్‌లో ఆలిండియా 18వ ర్యాంక్‌తో సంచలనం సృష్టించారు.
- ఆదిలాబాద్ జిల్లాలోనే ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. దివ్యదేవరాజన్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆమె శిక్షణ కలెక్టర్‌గా కొనసాగారు.
- మహబూబాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ తీసుకున్నారు. అక్కడ మూడేళ్లు పనిచేశారు.
- ఖమ్మం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా కొనసాగారు.
- ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు.
- తాజాగా కలెక్టర్‌గా తొలిసారి నియమితులయ్యారు.

యంత్రంతో ఎవుసం



లక్ష్మణచాందలో ట్రాక్టర్‌తో పసుపు వేస్తున్న రైతు

• సాగులో పెరిగిన యాంత్రీకరణ
• ట్రాక్టర్‌తోనే విత్తనాలు వేస్తున్న రైతులు
• కూలీల కొరతకు చెక్.. సమయం ఆదా..
• పెట్టుబడి భారం తగ్గుతుందంటున్న అన్నదాతలు

లక్ష్మణచాంద: వానాకాలం సాగు మొదలైంది. అడపా దడపా వర్షాలు పడుతుండడంతో రైతులు పొలం బాట పడుతున్నారు. దుక్కి దున్నడం మొదలుకుని విత్తనాలు వేయడం, ఎరువులు వేయడం, కలుపు తీయడం వరకు గతంలో కూలీలతో చేసేవారు. దీంతో సమయం ఎక్కువ అవడమే కాకుండా ఖర్చులు కూడా పెరిగేవి. కూలి రేట్లు పెరగడం, కూలీలు దొరకకపోవడం, పెట్టుబడి భారం పెరగడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో జిల్లాలో వ్యవసాయంలో యాంత్రీకరణ క్రమంగా పెరుగుతోంది.

గతంలో.. నేడు సాగు ఖర్చులు....

యాంత్రీకరణ లేక ముందు రైతులు ఎవరి ఎద్దులతో వారు అరకతోనే అన్నిరకాల విత్తనాలు వేసేవారు. ఎకరంలో మొక్కజొన్న విత్తనాలు వేయడానికి కనీసం ముగ్గురు నుంచి నలుగురు కూలీలు అవసరమయ్యేది. దీనికి తోడు ఒకరోజు సమయం పట్టేది. పసుపు పంట వేయడానికి కనీసం ఐదుగురు కూలీలు, అరక మనిషి అవసరం అయ్యేది. నేడు విత్తనాలు వేయడానికి సరిపడా ఎద్దులు లేకపోవడం, కూలి రేట్లు పెరగడంతో రైతులు యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ఒక్కో కూలీకి రోజుకు విత్తనాలు వేయడానికి రూ.300–400, అరక మనిషికి రూ.1000, ఎద్దులకు రోజుకు రూ.3000 కిరాయి ఉంది. మొక్కజొన్న సాగుకు ఎకరానికి విత్తనాలు వేయడానికి రూ.4000– రూ.5000 వరకు అవుతున్నాయి. అదేవిధంగా పసుపుకు రూ.5000–రూ.7000 వరకు అవుతున్నాయి. కానీ అదే ఎకరం సాగుకు మొక్కజొన్న విత్తనాలు ట్రాక్టర్‌తో వేయడానికి రూ.2000, పసుపు వేయడానికి 3,500 వరకు ఖర్చు అవుతున్నాయి. దీంతో సమయం తగ్గడంతోపాటు, సాగు ఖర్చులు కూడా సగానికి తగ్గుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

యాంత్రీకరణకే మొగ్గు..

జిల్లాలో ఎద్దులు ఉన్న రైతులు మినహా.. మిగతా రైతులంతా యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో అన్నిరకాల విత్తనాలు యంత్రాల సహాయంతోనే వేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, పసుపు, సోయా, కంది, పెసర, బొబ్బర్లు, మినుములు, వరి వంటి అన్ని రకాల విత్తనాలతోపాటు ఎరువులు



సోన్ వద్ద మాన్యువల్ సీడర్‌తో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతు

కూడా వేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతులు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న, పసుపు, సోయా వంటి విత్తనాలు వేయడానికి ట్రాక్టర్‌కు అమర్చిన యంత్రం వినియోగిస్తుండగా, వరి విత్తనాలు కూడా పవర్ టిల్లర్‌తో పొడి దుక్కులలోనే ట్రాక్టర్ సహాయంతో వేస్తున్నారు. పత్తి విత్తనాలు కూడా మాన్యువల్ సీడర్‌తో వేస్తున్నారు.

గంటకు రూ.1800..

ఎద్దులను పోషించడం కష్టంగా మారడంతో చాలా మంది రైతులు వాటిని అమ్ముకుంటున్నారు. దీంతో ట్రాక్టర్‌తోనే విత్తనాలు వేసుకోవాల్సి వస్తుంది. దీనిని అదునుగా తీసుకుని యంత్రాల యజమానులు గంటకు రూ.1600 నుంచి రూ.1800 వరకు తీసుకుంటున్నారు.

ఖర్చులు తగ్గుతున్నాయి



రెండు ఎకరాల్లో పసుపు, ఎకరంలో మొక్కజొన్న విత్తనాలు ట్రాక్టర్ సహాయంతో వేశాను. ఎద్దులతో వేసినప్పుడు ఎకరానికి నలుగురు కూలీలు, అరక మనిషి, అన్నీ కలిపి రూ.4 వేల నుంచి రూ.5 వేలు ఖర్చయ్యేది. ట్రాక్టర్ వేయడం వల్ల ఖర్చులు తగ్గాయి.

– గంగారెడ్డి, రైతు చామన్‌పల్లి

కిరాయి వెళ్తున్నా..



మొక్కజొన్న, పసుపు వంటి విత్తనాలు వేయడానికి ట్రాక్టర్‌తో వెళ్తున్నా. గంటకు రూ.1600 నుంచి రూ.1800 తీసుకుంటున్నా. ట్రాక్టర్‌తో విత్తనాలు వేసే యంత్రాలు కూడా చాలా మందివద్ద ఉన్నాయి. రోజుకు 6 నుంచి 7 గంటల కిరాయికి దొరుకుతుంది.

– దేవన్న, ట్రాక్టర్ యజమాని పీచర

డబుల్ బెడ్రూం ఇళ్లు ఖాళీ చేయించిన అధికారులు



ఆందోళన చేస్తున్న ఆక్రమణదారులు

కడెం: మండల కేంద్రంలోని పెద్దూర్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఈనెల 8న, కడెం, కన్నాపూర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు ఆక్రమించుకున్నారు. ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు పలుమార్లు చెప్పినా వినకపోవడంతో, తహసీల్దార్ సుజాత, ఎంపీపీ అలెగ్జాండర్, ఎంపీడీవో అరుణ, పోలీసులతో కలిసి శనివారం ఖాళీ చేయించారు. ఈసందర్భంగా పలువురు మహిళలు ఇళ్లను ఖాళీ చేయమని ఆందోళన చేశారు. ఖాళీ చేయకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో అందరూ ఖాళీ చేసి వెళ్లిపోయారు. అనంతరం తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో ఇళ్లకు తాళాలు వేయించారు. డబుల్ బెడ్రూం కాలనీలో విద్యుత్, తాగునీటి, పారిశుద్ధ్య పనులు పూర్తి చేశాక, అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.



ఇళ్లకు తాళం వేయిస్తున్న తహసీల్దార్ సుజాత

క్లుప్తంగా

లైన్‌మెన్‌ సస్పెన్షన్‌

ముథోల్‌: ముథోల్‌ లైన్‌మెన్‌ హల్దార్‌ను సస్పెండ్‌ చేసినట్లు భైంసా డివిజన్‌ ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ఓ రైతుకు మూడుబోర్లు ఉన్నప్పటికీ 12 బోర్లు ఉన్నట్లు సృష్టించి తప్పుడు సర్వే పంపించడంతో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. అధి కారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా విషయం బయటకు వచ్చింది. ఏడీఏ లక్ష్మణ్‌ విచారణ జరపడంతో డిపార్ట్‌మెంట్‌కు సుమారు రూ. 6.30 లక్షల నష్టానికి కారకుడైనట్లు తేలింది. దీంతో లైన్‌మెన్‌ను సస్పెండ్‌ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో చోరీ



ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: మండలంలోని ఒడ్డెపెల్లి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని పగుల గొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయాన్ని సందర్శించి వివరాలు సేకరించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ధన్నూర్‌లో రెండు దుకాణాల్లో..


బోథ్‌: ధన్నూర్‌(బి) బస్టాండ్‌లోని రెండు దుకాణాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఓ పాన్‌షాపులో రూ. 3 వేల నగదుతో పాటు సిగరెట్‌ ప్యాకెట్లు, ఇతర సామగ్రి, పక్కనే ఉన్న మరో దుకాణంలో రూ.10 వేల నగదుతో పాటు పలు యంత్రాలను ఎత్తుకెళ్లారు. పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

రిమ్స్‌లో బైక్‌..

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆస్పత్రిలో బైక్‌ చోరీ జరిగినట్లు టుటౌన్‌ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌ రూరల్‌ మండలంలోని లాండసాంగ్వికి చెందిన ఎలిశెట్టి లస్మన్న తన మనవడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో మే 19న రాత్రి రిమ్స్‌ ఆస్పత్రిలో చేర్పించారు. ఉదయం చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల వెతికినప్పటికీ వాహనం కనిపించలేదు. దీంతో శనివారం బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మఠంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో చోరీకి పాల్పడిన నిందితుడిని వన్‌టౌన్‌ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉదయ్‌ కుమార్‌ తెలిపారు. శుక్రవారం రాత్రి గోపాల కృష్ణ మఠంలో హుండీ పగులగొట్టి రూ.10 వేల నగదు అపహరించినట్లు ఆలయ ఈవో సోమాజీ శ్రీనివాస్‌ ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్‌ పరిశీలించి నిందితుడి కోసం గాలించగా రైల్వేస్టేషన్‌లో పట్టుబడ్డాడు. మహారాష్ట్రలోని బద్రావతికి చెందిన శుభంవిఠల్‌ జాడేగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి నుంచి రూ.8,100 నగదు రికవరీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ప్రపంచంలో అందమైన పదం అమ్మ... మధురమైన పిలుపు నాన్న.. అమ్మ జన్మనిస్తుంది. నాన్న జీవితాన్ని ఇస్తాడు. అమ్మ నిజం.. నాన్న నమ్మకం.. నవ మాసాలు మోసి తల్లి జన్మనిస్తే ...ఆ బిడ్డలను సాకి పెంచి పెద్ద చేయడానికి రెక్కలు ముక్కలు చేసుకుంటాడు తండ్రి. బిడ్డల కోసం తన సంతోషాలను త్యాగం చేసేది.. పిల్లల భవిష్యత్‌ కోసం పరితపించే వ్యక్తి నాన్నే.. బిడ్డలు ప్రయోజకులు అవుతుంటే తాను పడిన కష్టాలు మర్చిపోయి మురిసిపోయే నిస్వార్థజీవి. వంద మంది ఉపాధ్యాయులకు సమానమైన స్థాయి నాన్నది. అందుకే పితృ దేవోభవ అంటారు. నేడు ఫాదర్స్‌డే సందర్భంగా పిల్లల ఉన్నతి కోసం తమ జీవితాలను ధారబోసిన తండ్రులపై ప్రత్యేక కథనం.

క్రమశిక్షణతో పెంచారు



మంచిర్యాల టౌన్‌: మాది వరంగల్‌ జిల్లా హుజూరాబాద్‌ సమీపంలోని పోతిరెడ్డిపేట. మా అమ్మానాన్నలు భారతి, దేవేందర్‌రెడ్డి. మానాన్న సీకేఎం కాలేజీలో ల్యాబ్‌ డెమాన్‌స్ట్రేటర్‌గా పనిచేసి రిటైర్‌ అయ్యారు. మా అమ్మానాన్నల తండ్రులు ఉన్నత చదువులు చదివిన వారే కావడంతో నన్ను, మా తమ్ముడిని చిన్ననాటి నుంచి చదువుపైనే పూర్తి ధ్యాస పెట్టేలా చూసేవారు. ఏ చిన్న తప్పు జరిగినా శిక్షించి మరోసారి చేయకుండా క్రమశిక్షణతో పెంచారు. మా తమ్ముడు మహేశ్‌రెడ్డి ఇంజనీరింగ్‌ చేసి అమెరికాలో సెటిల్‌కాగా నేను డాక్టర్‌నయ్యాను. ఇప్పటికీ మా నాన్నను చూస్తే నాకు భయంతో కూడిన భక్తి ఉంది.

– డాక్టర్‌ హరీశ్చంద్రరెడ్డి, ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌

నాన్నే నా తొలి గురువు



పాతమంచిర్యాల: నా జీవితంలో మా నాన్నే నా తొలిగురువు. నా చిన్నతనంలోనే మా అమ్మ చంద్రకళ చనిపోవడంతో నాన్న కనపర్తి జానకిరాములు అన్నీ తానై నన్ను ఉన్నతస్థితికి తీసుకొచ్చారు. ఉద్యోగ రీత్యా కళాశాల లెక్చరర్‌ అయినా నాచదువు విషయంలో చాలా శ్రద్ధచూపేవారు. ఆయన నేర్పిన క్రమశిక్షణ, నడవడిక వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను. నా మొదటి గురువు మానాన్నేనని గర్వంగా చెప్పుకుంటా.

– కే.విశ్వేశ్వర్, జిల్లా లీగల్‌ మెట్రాలజీ అధికారి, మంచిర్యాల

బిడ్డల ఎదుగుదలకు నిచ్చెన..



నలుగురు కుమారులతో సత్తయ్య దంపతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి కార్మికుడు వెంబడి సత్తయ్యకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. అక్షరజ్ఞానం తెలియని వాడైనా కొడుకులను ఉన్నతంగా చదివించాలని ఆరాటపడ్డాడు. తండ్రి ఆశలకు అనుగుణంగా డిగ్రీలు చేసిన కుమారులు ఒక్కొక్కరుగా ఉద్యోగయత్నాలు చేశారు. పెద్దకుమారుడు రమేశ్‌ పోలీసుశాఖలో కానిస్టేబుల్, రెండో కుమారుడు భీమేశ్‌ ఎస్సై (ప్రస్తుతం సీఐ), మిగతా ఇద్దరు సురేష్, సంతోష్‌ సింగరేణిలో క్లర్క్‌లుగా పని చేస్తుండడంతో సత్తయ్య పడిన శ్రమ సత్ఫలితాలు ఇచ్చింది. భూగర్భంలో దిగి 39 ఏళ్ల పాటు సింగరేణిలో చెమట చిందించిన సత్తయ్య వచ్చిన డబ్బును దాచుకోకుండా బిడ్డల భవిష్యత్‌ కోసం ఖర్చుచేశాడు. కుమారులు ఉద్యోగాలు చేస్తుండటంతో ఆ తండ్రి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.

ప్రయోజకుల్ని చేశాడు..



కుమారులతో దాసరి భూలింగు

కుంటాల: కుంటాలకు చెందిన రైతు దాసరి భూలింగు, గజ్జవ్వ దంపతులకు నలుగురు కుమారులు సంతానం. వారిని ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు రమేశ్‌ ఉపాధ్యాయుడిగా, రెండో కుమారుడు మహేందర్‌ మెదక్‌లోని బీవీఆర్‌ ఐటీ ఇంజనీరింగ్‌ కళాశాలలో ప్రొఫెసర్‌గా, మూడో కుమారుడు ధనుంజయ్‌ ఎండీ, ఫిజీషియన్‌గా, చిన్న కుమారుడు రాజలింగు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కష్టపడి చదివించిన పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండడం ఎంతో సంతోషంగా ఉందని భూలింగు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

వాట్సాప్‌ వేదికగా వివాదం..!

• ఇరువర్గాలపై కేసులు నమోదు

భైంసాటౌన్‌: భైంసా మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ లక్ష్యంగా ఓ వాట్సాప్‌ గ్రూపులో పోస్టుల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వివాదం రేగడంతో ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డి రాజారెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన అన్సార్‌ అహ్మద్, ఆమెర్‌ అహ్మద్‌ అడ్మిన్లుగా ఉన్న ఓ వాట్సాప్‌ గ్రూప్‌లో పరోక్షంగా వైస్‌చైర్మన్‌ను ఉద్దేశించి పోస్టులు చేయడంతో వివాదం రేగింది. ఈ క్రమంలో ఆమెర్‌ అహ్మద్, జాకీర్‌ అహ్మద్‌ తనకు ఫోన్‌ చేసి చంపుతామని బెదిరిస్తున్నారంటూ అన్సర్‌ అహ్మద్‌ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కోర్టు అనుమతితో కేసు నమోదు చేయగా శనివారం ఉదయం తహసీల్దార్‌ వద్ద బైండోవర్‌కు వెళ్తున్న క్రమంలో బస్టాండ్‌ వద్ద ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం రెండువర్గాల నుంచి నలుగురిని తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు. ఇరుపక్షాల ఫిర్యాదుతో కేసులు నమోదు చేశామన్నారు. రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్న మూడు వాట్సాప్‌ గ్రూపుల అడ్మిన్లపై ఐటీ యాక్ట్‌ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పుకార్లు వ్యాపింపజేసే వారిపై పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌: 2024–2025 విద్యా సంవత్సరానికి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌ ఎడ్యుకేషనల్‌ ఇనిస్టిట్యూషన్స్‌ సొసైటీలో ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దుర్గం మ్యాన్‌ పవర్‌ సొసైటీ చైర్మన్‌ దుర్గం శేఖర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. టీచింగ్, నాన్‌ టీచింగ్, స్టాఫ్‌ ఉద్యోగాలు ఉన్నాయన్నారు. పీజీటీ ఇంగ్లిష్, జేఎల్‌ బోటనీ, పీజీటీ ఫిజికల్‌ సైన్స్, ఇంగ్లిష్, టీజీటీ హిందీ, జేఎల్‌ జువాలజీ, జేఎల్‌ ఇంగ్లిష్, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ మ్యాథ్స్, జేఎల్‌ తెలుగు, స్టాఫ్‌ నర్సు, డిప్యూటీ వార్డెన్‌ పోస్టులు ఉన్నాయన్నారు. ఈ నెల 17 నుంచి 19 లోగా జిల్లా కేంద్రంలోని దుర్గం మ్యాన్‌ పవర్‌ సొసైటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూకబ్జా వ్యవహారంలో స్వల్ప ఉద్రిక్తత



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్సై

కైలాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ పట్టణం కైలాస్‌నగర్‌లోని భూ కబ్జా వ్యవహారంలో శనివారం ఇరువర్గాల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థలాన్ని పరిరక్షించాలని కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు పోరాటం చేస్తుండగా ఆ స్థలం తమదేనంటూ మరో వర్గం వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసే పరిస్థితి ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న మావల ఎస్సై విష్ణువర్ధన్‌ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. ఇరువర్గాలు శాంతియుతంగా ఉండాలని మంగళవారం ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

అనుమానం పెనుభూతమై ..

• భార్యను కడతేర్చిన భర్త
• నిందితుడి రిమాండ్‌
• ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో ఘటన



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: అనుమానం పెనుభూతంగా మారి ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్న ఘటన ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మొదటి భార్య ఉన్నప్పటికీ ప్రేమించి మరో మహిళను పెళ్లాడిన వ్యక్తి చివరకు ఆమెను కడతేర్చాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు రెండు రోజుల్లోనే కేసు మిస్టరీని ఛేదించి నిందితుడిని కటకటాల్లోకి పంపించారు. జిల్లా కేంద్రంలోని టూటౌన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న ఉదయం 10గంటల సమయంలో మున్సిపల్‌ జవాన్‌ సాయికృష్ణ.. ఓ మహిళ మృతదేహాన్ని ఖుర్షీద్‌నగర్‌లోని మమత జిన్నింగ్‌ మిల్‌ సమీపంలో గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. టూటౌన్‌ సీఐ అశోక్‌ సిబ్బందితో అక్కడికి చేరుకొని గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలు పరిశీలించి జిన్నింగ్‌ వైపు వెళ్లిన ఆటో వివరాలపై ఆరా తీశారు. సోషల్‌ మీడియాతో పాటు పత్రికల్లో వార్తలు రావడంతో మృతురాలు భారతి అలియాస్‌ సల్మాగా మృతురాలి తల్లి సుభద్రబాయి, సోదరి అనసూయ గుర్తించారు. ఈ క్రమంలో ఆరా తీయగా.. ఈమె మహారాష్ట్రలోని శివాని గ్రామానికి చెందినట్లు తెలిసింది. పదేళ్ల క్రితం జిన్నింగ్‌ మిల్లులో పని చేయడానికి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ క్రమంలో అదే జిన్నింగ్‌ మిల్లులో పనిచేస్తున్న ఖలీల్‌తో ప్రేమ వ్యవహారం సాగింది. దీంతో ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఎస్టీ నాయక్‌పోడ్‌ కులానికి చెందిన మృతురాలు ముస్లింగా మారింది. ఇది వరకే మొదటి భార్య ఉండగా ఆమెకు నలుగురు సంతానం. కొంత కాలం మొదటి, రెండో భార్యతో కలిసి సాఫీగా ఉన్నప్పటికీ తర్వాత ఏర్పడ గొడవల కారణంగా మొదటి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి వీరు కలిసి జీవిస్తున్నారు. అయితే కొంత కాలంగా ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఇంట్లో తరచూ గొడవలు రావడంతో ఆమె ఈ ఏడాది మార్చి నెలలో ఇంటి నుంచి మహారాష్ట్రకు వెళ్లిపోయింది. భర్త ఖలీల్‌ టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. మహారాష్ట్ర నుంచి ఆమెను తీసుకువచ్చిన పోలీసులు తన తల్లి, సోదరికి అప్పజెప్పారు. భర్త వెంట ఉండేందుకు ఆమె నిరాకరించింది. వారిని ఒప్పించి కాపురానికి తీసుకెళ్లాడు. 12న రాత్రి ఇంటికి వెళ్లిన సమయంలో ఇంటి నుంచి ఎవరో వ్యక్తి తనను చూసి పారిపోయాడని వేధిస్తూ కర్రచెక్కతో దాడికి పాల్పడ్డాడు. శరీరంపై తీవ్ర గాయాలైన ఆమె మృతి చెందింది. తన ఆటోలో మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇంటికి వెళ్లి చూడగా నిందితుడు పరారీలో ఉన్నట్లుగా గుర్తించారు. ఆ తర్వాత నిందితుడిని శనివారం అదుపులోకి చేసుకుని రిమాండ్‌కు పంపించారు. నిందితుడి నుంచి ఆటోతో పాటు దాడికి పాల్పడిన కర్రచెక్కను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో వన్,టూటౌన్‌ సీఐలు సత్యనారాయణ, అశోక్, ఎస్సైలు లాల్‌సింగ్‌ నాయక్, నారాయణ తదితరులున్నారు.

పిడుగుపాటుతో ఒకరు మృతి



బూర్ల నర్సయ్య మృతదేహం

నర్సాపూర్‌(జి): మండలంలోని చాక్‌పల్లి అనుబంధ గ్రామమైన పాత బూరుగుపల్లి(కే) శివారు ప్రాంతంలో శుక్రవారం పిడుగుపాటుతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... లోకేశ్వరం మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన బూర్ల నర్సయ్య (55) నర్సాపూర్‌(జి) మండలంలోని పాత బూరుగుపల్లి (కె)లో మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మద్యం మత్తులో మన్మథ్‌ నుంచి తిమ్మాపూర్‌ (జి)లో ఉన్న తన కూతురు వద్దకు రోడ్డుమార్గంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం అటుగా వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి ఆచూకీ కొరకు ఫొటోలను సామాజిక మాధ్యమంలో పోస్ట్‌ చేశారు. మృతుడి భార్య భోజవ్వ, కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో సంఘటన స్థలానికి వెళ్లి గుర్తుపట్టారు. భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

లక్ష్మణచాంద: విద్యుత్‌ తీగలు ఏర్పా టు చేసి గేదె మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు. మండలంలోని కనకాపూర్‌కు చెందిన పిండి వినోద్‌ గ్రామ శివారులోని తన వ్యవసాయ చేనులో విద్యుత్‌ తీగలు అమర్చడంతో శుక్రవారం అటుగా వెళ్లిన గేదె విద్యుత్‌ షాక్‌ తగిలి మృతి చెందింది. గేదె యజమాని మహేందర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కుభీర్‌: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పీ.రవీందర్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన కొంగర్ల లక్ష్మణ్‌ (55)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం అతిగా మ ద్యం సేవించి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

నందిపేట్‌(ఆర్మూర్‌): ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిర్మల్‌ జిల్లా తానూర్‌ మండల కేంద్రానికి చెందిన బుర్రి లక్ష్మణ్‌ (38) ఆత్మహత్య చేసుకున్నట్లు నిజామాబాద్‌ జిల్లా నందిపేట ఎస్సై రాహుల్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. బుర్రి లక్ష్మణ్‌ కొంతకాలంగా మోపాల్‌ మండలం మంచిప్పలో వ్యవసాయ కూలీగా పనిచేస్తూ భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. శనివారం ఉదయం నందిపేటలో ఉంటున్న తమ్ముడు బుర్రి గంగాధర్‌ వద్దకు వచ్చి మద్యం సేవించాడు. ఒకవైపు మద్యానికి బానిసకావడం, మరో వైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా జీవితంపై విరక్తి చెంది బస్టాండ్‌ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గంగాధర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో తండ్రి.. పాముకాటుతో తల్లి..

• ఇద్దరి మృతితో అనాథలుగా మారిన చిన్నారులు



అనాథలైన నవ్యశ్రీ, రిషిక్‌

తాంసి: మూడేళ్లక్రితం అనారోగ్యంతో తండ్రి.. శుక్రవారం పాముకాటుతో తల్లి మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. భీంపూర్‌ మండలంలోని కైరిగూడకు చెందిన పెందూర్‌ అనిల్, లక్ష్మి దంపతులు తమకున్న వ్యవసాయ భూమిలో పనులు చేసుకుంటూ జీవించేవారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. మూడేళ్ల క్రితం అనారోగ్యానికి గురికావడంతో అనిల్‌ మృతి చెందాడు. కుటుంబ భారాన్ని లక్ష్మి తనపైనే వేసుకుని తమకున్న భూమిలో పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంటివద్ద పెరట్లో పనులు చేసుకుంటూ ఉండగా పాము కాటు వేసింది. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందింది. తల్లిదండ్రుల మృతితో కుమార్తె నవ్యశ్రీ, కుమారుడు రిషిక్‌ అనాథలుగా మారారు. వయోభారంతో ఉన్న తాత గంభీర్‌ పిల్లలను సంరక్షించే పరిస్థితిలో లేడు. నవ్యశ్రీ నార్నూర్‌ మండలంలోని మాన్కాపూర్‌లో ఏడో తరగతి, రిషిక్‌ లోకారిలో ఐదో తరగతి చదువుతున్నా డు. మానవతావాదులు, ప్రభుత్వం సైతం స్పందించాలని స్థాని కులు కోరుతున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

• ఫాస్ట్‌ట్రాక్‌ కోర్టు ఏర్పాటు చేయాలి
• బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌



కలెక్టర్‌కు విన్నవిస్తున్న మృతుని తల్లిదండ్రులు, ఎమ్మెల్యే

కై లాస్‌నగర్‌: నార్నూర్‌ మండలం నాగల్‌కొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్‌ గజానంద్‌ను హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ డిమాండ్‌ చేశారు. శనివారం మృతుని తల్లిదండ్రులు, కుమారుడు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. కలెక్టర్‌ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుని భార్య పక్కా ప్రణాళికతో సుపారి ఇచ్చి హత్యచేయించిందన్నారు. ఆస్తులన్నీ తన పేరిట రిజిస్ట్రేషన్‌ చేసుకోవడంతో పాటు ఎల్‌ఐసీ బాండ్లను తన పేరిట పొందిందన్నారు. వాటిని కుమారిడి పేరిట రిజిస్ట్రేషన్‌ చేసి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. దుండగులకు కఠిన శిక్షపడేలా ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టును ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని కోరారు. ఇందుకు కలెక్టర్‌ స్పందిస్తూ దీనిపై జిల్లా ఎస్పీకి రాస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టును ఏర్పాటు చేయని పక్షంలో వేలాది మందితో కలెక్టర్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

క్లుప్తంగా

మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్

తానూరు: పదో విడత హరితహారం కోసం మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా, వీధుల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఉపాధి కూలీల ద్వారా నాటించాలన్నారు. పల్లెల్లో మురుగుకాల్వల్లో చెత్త తొలగించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



బాజాభజంత్రీలతో వెళ్తున్న గ్రామస్తులు

భైంసారూరల్: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని సుంక్లి గ్రామంలో గ్రామస్తులు సామూహిక పూజలు నిర్వహించారు. శనివారం బాసర గోదావరి నుంచి గంగాజలాన్ని తీసుకువచ్చి బాజభజంత్రీలతో ఆలయాలకు వెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పంటలు పండి గ్రామాలు చల్లగా ఉండేలా చూడాలంటూ దేవతలను వేడుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

కుంటాలలో..

కుంటాల: వర్షం కురవాలని కోరుతూ మండలంలోని కల్లూర్‌లో హనుమాన్ ఆలయంలో శనివారం గ్రామస్తులు పూజలు నిర్వహించారు. డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకున్నారు.


వేధిస్తే 100 డయల్ చేయండి



అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే 100 డయల్ చేయాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు షీటీం సేవలపై శనివారం అవగాహన కల్పించారు. 100 డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 తదితర గురించి వివరించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు రమాదేవి, రాధిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కొనసాగుతున్న భగీరథ సర్వే



పొట్టపెల్లి(కే)లో సర్వే చేస్తున్న కార్యదర్శి

లక్ష్మణచాంద: గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతోంది. పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కార్యదర్శులు, సిబ్బంది శనివారం ఈ సర్వే చేపట్టారు. భగీరథ నల్లా ఉందా ఉంటే నీళ్లు వస్తున్నాయా లేదా అనే వివరాలను అడిగి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కార్యదర్శులు విక్రమ్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

టీఎస్ఆర్‌జేసీకి విద్యార్థి ఎంపిక



తరుణ్‌ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి తరుణ్ టీఎస్ఆర్‌జేసీకి బెల్లంపల్లి కళాశాలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమణారావు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత చెందిన తరుణ్.. టీఎస్ఆర్‌జేసీకి ఎంపికవడంతో ఆయన్ను శనివారం ఉపాధ్యాయులు సన్మానించారు. మహిపాల్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రమేశ్, పద్మావతి ఉన్నారు.

రక్తదానం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌కు చెందిన మధుక్రిష్ణ శనివారం జన్మదిన సందర్భంగా రక్తదానం చేశాడు. నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో తన మిత్రులు మరో ఇద్దరితో కలిసి రక్తదానం చేసి ఔదార్యం చాటుకున్నాడు.

చలానా.. జాన్తానై..!



'డబుల్' లబ్ధిదారుల ఆందోళన సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతుండగా మరోవైపు టిప్పర్‌లో తరలుతున్న మొరం

- జోరుగా ఇసుక అక్రమ రవాణా
- రోడ్ల పక్కనే భారీగా డంప్‌లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

భైంసాటౌన్: ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఇష్టారీతిన వాగుల్లోకి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లలో ఇసుక తరలించి ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. ట్రిప్పునకు రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తూ అక్రమార్జన చేస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వాగుల్లో నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలించి పట్టణంలోని ఖాళీ ప్రదేశాలతోపాటు ప్రధాన రోడ్డు వెంబడి బహిరంగంగానే నిల్వ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు, రెవెన్యూ అధికారులు ఆ వైపు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు మాఫియాగా ఏర్పడి ఇసుక అక్రమ దందా కొనసాగిస్తున్నారు.

భారీగా డంప్‌లు

పట్టణం నానాటికి విస్తరిస్తుండడంతో నూతన భవన నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. దీంతో ఇసుకకు డిమాండ్ నేపథ్యంలో అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వర్షాకాలంలో వాగుల్లో నీరు చేరితే ఇసుక తవ్వకం సాధ్యం కాదని, ముందస్తుగానే ట్రాక్టర్లలో జోరుగా ఇసుకను తరలిస్తున్నారు. ఇలా తరలించిన ఇసుకను ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. భైంసా–ఖత్గాం శివారులో, రాహుల్ నగర్, కిసాన్‌గల్లి బొర్ర గణేశ్ సమీపంలో, భైంసా–బాసర మార్గంలో, నేతాజినగర్, గణేశ్‌నగర్‌లో ఇసుక డంప్ చేస్తున్నారు. భైంసా–బాసర మార్గంలో రోడ్డు పక్కనే ఇసుక డంప్‌లు కనిపిస్తున్నా సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అన్న విమర్శలు వస్తున్నాయి.



నిర్మల్–భైంసా మార్గంలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక



బొర్ర గణేశ్ సమీపంలో ఇసుక డంప్

ఆదాయానికి గండి..

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకుగాను గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేసి నూతన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం.. గృహ, ఇతర భవన నిర్మాణ అవసరాలకు ఇసుక తరలించేందుకు అనుమతి తప్పనిసరి చేసింది. ట్రాక్టర్(3 క్యూబిక్ మీటర్లు)కు రూ.800 చలానా తహసీల్దార్ పేరిట చెల్లిస్తే వారు అనుమతి ఇస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలలోపే ఇసుక తరలించాలి. అనుమతి లేకుండా తరలిస్తూ పట్టుబడితే మొదటిసారి రూ.5 వేలు, రెండోసారి పట్టుబడితే రూ.15 వేలు జరిమానా విధించాలి. ఇసుక తోడే జేసీబీ వంటి యంత్రాలు పట్టుబడితే మొదటిసారి రూ.50 వేలు, రెండోసారి రూ.లక్ష జరిమానా విధించాలని ఆదేశాలున్నాయి. కానీ, ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఇటీవలి కాలంలో ఒక్క చలానా కూడా రాలేదని సంబంధిత అధికారులే చెబుతుండడం గమనార్హం. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుండగా, అక్రమార్కులు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయం ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు

ఇసుక తరలింపునకు అధికారుల అనుమతి తప్పనిసరి. ట్రాక్టర్‌కు రూ.800 చలానా చెల్లించి అనుమతి పొందాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పోలీసుశాఖ సహకారం తీసుకుంటాం.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్, భైంసా

బీమాతో కుటుంబాలకు ధీమా



బీమా చెక్కు అందిస్తున్న అధికారులు

కడెం: బీమాతో కుటుంబాలకు ధీమా ఉంటుందని టీజీబీ నిర్మల్ రీజినల్ మేనేజర్ డీవీఎస్ రామారావు తెలిపారు. మండల కేంద్రంలోని టీజీబీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై, ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్, పాలసీపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కాగా, మండల కేంద్రానికి చెందిన నాగుల లక్ష్మీనరసింహా ఆరునెలల క్రితం మృతిచెందాడు. ఎస్బీఐ జనరల్ ఇన్సురెన్స్‌లో రూ.వెయ్యి చెల్లించగా, మంజూరైన రూ.20 లక్షల బీమా చెక్కును కుమారులు కళ్యాణ్, సాయిలకు శనివారం అందజేశారు. ఎస్బీఐ జనరల్ మేనేజర్ అబ్రహం, టీజీబీ పెద్దూర్ బ్రాంచి మేనేజర్ చిట్టోజు అంజాచారి, ఫీల్డ్ ఆఫీసర్ జి.ప్రమోద్, అకౌంటెంట్ పి.సీతారామయ్య, క్యాషియర్ ఎస్. కుమారస్వామి, ఐకేపీ ఏపీఎం రాజారాం, ఆఫీస్ సబార్డినేట్ రాజ్‌కుమార్, బ్యాంక్ మిత్ర శ్యామల ఉన్నారు.

కొనసాగుతున్న బడిబాట



ఎల్ఈడీ టీవీని పరిశీలిస్తున్న రాజేశ్వర్

లక్ష్మణచాంద: మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కొనసాగుతుంది. బాబాపూర్ జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ రాజేశ్వర్ శనివారం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు అందజేశారు. అనంతరం తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు, కంప్యూటర్ ల్యాబ్ పరిశీలించారు. పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా తనవంతు రూ.2500లు అందిస్తానని తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం నగేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వన భోజనాలు



లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ గ్రామంలోని రాజ్యలక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు శనివారం సామూహిక వన భోజనాలు నిర్వహించారు. ముందుగా భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. పూజారి నరసింహస్వామి తదితరులు ఉన్నారు.

దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. 110 మంది పేద కుటుంబాలకు రూ.40 వేల విలువ చేసే దుప్పట్లను బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌తో వీటిని అందజేశారు.

వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

ఖానాపూర్: అమృత్–2 పథకం ద్వారా మున్సిపాలిటీ పరిధిలో రెండు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ కోసం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అధికారులతో కలిసి శనివారం స్థలాన్ని పరిశీలించారు. కౌన్సిలర్లు, నాయకులు ఖలీల్, పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా, కమిషనర్ మనోహర్, మున్సిపల్ డీఈ సంతోశ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ కలెక్టర్ శివలింగయ్య

కుంటాల: మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ శ్రీనివాస్, మదన్ మోహన్ తల్లి భోజవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శనివారం జనగామ మాజీ కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ కోఆప్షన్ మెంబర్ హైమద్ పాషా, దేవిదాస్, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కన్కపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం ప్రభాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు రవీందర్, రజిత, అంగన్‌వాడీ టీచర్ ప్రభ, వీవో అధ్యక్షురాలు భైరి లక్ష్మి, సీఏలు పోశెట్టి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం

కుభీర్: కుభీర్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాహుల్, ఉపాధ్యక్షుడిగా డి.నాగారావ్, ప్రధాన కార్యదర్శిగా భీంరావ్, కోశాధికారిగా దత్తాత్రి, సహకార్యదర్శిగా భూషన్, సభ్యులుగా సచిన్, ప్రకాశ్, రాజు, కేర్బా, గంగాధర్, ప్రకాశ్ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడిని సన్మానించారు.

కార్యవర్గం ఎన్నిక

సారంగపూర్: మండలంలోని అడెల్లి గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గాన్ని శనివారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రాజశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షుడు రాకేశ్‌రావు, కోశాధికారి సాయన్న, ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

భైంసాటౌన్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య, నోటు పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ విక్రయించడంతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. ఏబీవీపీ నాయకులు గంగాప్రసాద్, చంద్రకాంత్ ఉన్నారు.

19న తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణంలో బుధ, ఆదివారాల్లో జరిగే వారసంతతోపాటు దినసరి దుకాణాల నిర్వహణ పన్నుల వసూళ్లకు ఈనెల 19న తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఈనెల 18న కార్యాలయం పనివేళలో సాయంత్రం 5 వరకు రూ.లక్షతో తీసిన డీడీ అందించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి టీజీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ లక్ష్మీప్రసన్న వినియోగదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి పొందాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు పొదుపు, తీసుకున్న రుణాల వాయిదాలను సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకు ఫీల్డ్ అధికారి ప్రతాప్, బ్యాంకు అధికారి రాంగోపాల్, నాయకులు లింగారెడ్డి, ప్రజలు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడెం: మండలంలోని కడెం, బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ కొట్టె శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఖానాపూర్: మహబూబాబాద్ జిల్లాలో గిరిజన మహిళపై లైంగిక దాడిచేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రజా పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు బన్సీలాల్ రాథోడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉపాధి నిమిత్తం వలసవచ్చి జీవిస్తున్న బానోత్ నరేశ్ నిరుపేద గిరిజనుడి కూతురిని మాయమాటలతో తీసుకెళ్లి లైంగిక దాడి చేసి హత్యచేయడం దారుణమన్నారు. బాధ్యులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

జీవామృతం.. పంటలకు జీవం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

- తయారీ, విధానంపై రైతులకు అవగాహన

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల భూమిలో సూక్ష్మజీవరాశి, సేంద్రియ పదార్థం నశించి పొలాలు నిస్సారమైపోతున్నాయి. ఈ దశలో భూమిని తిరిగి సారవంతం చేయడం అత్యవసరం. అందుకు 'జీవామృతం'చక్కగా ఉపయోగపడుతుందని ఏవో నాగరాజు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రథానికి నాలుగు చక్రాలు. వాటిలో జీవామృతం ఒకటి. మిగతావి.. బీజామృతం, ఆచ్ఛాదన, నీటి యాజమాన్యం. జీవామృతం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు, వానపాములు ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెందుతాయి. మట్టిలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులు, వానపాములను చైతన్యం చేయడం ద్వారా జీవామృతం భూసారం పెరగడానికి దోహదపడుతుంది. భూమిలోని పోషకాలను మొక్కలు నేరుగా వినియోగించుకునే రూపంలోకి మార్చి అందించడంలో వానపాములు, సూక్ష్మజీవుల పాత్ర అసాధారణమైనది. మేలు చేసే కోట్ల సూక్ష్మజీవులకు నిలయం పశువుల పేడ, పశువుల మూత్రం. పేడ, మూత్రంతోపాటు బెల్లం, పప్పుల పిండి, నీటిని కలిపినప్పుడు.. పేడలోని సూక్ష్మజీవరాశి ప్రతి 20 నిమిషాలకు రెట్టింపవుతుంది.



తయారుచేసిన జీవామృతం

జీవామృతం తయారీ విధానం..

ఎండ తగలని చోట పెట్టిన సిమెంట్ తొట్టి లేదా ప్లాస్టిక్ పీపాలో 200 లీటర్ల నీటిని నింపాలి. పశువుల పేడ, మూత్రం, బెల్లం, పిండి తదితరాలను అందులో వేసి బాగా కలపాలి. గడియారం ముల్లు తిరిగే దిశగా అంటే సవ్యదిశలో కర్రతో కలియతిప్పాలి. దానిపై గోనె సంచి కప్పాలి. ఉదయం నిమిషం, సాయంత్రం నిమిషం కలియతిప్పుతూ ఉండాలి. అందులో సూక్ష్మజీవరాశి ప్రతి 20 నిమిషాలకోసారి రెట్టింపవుతూ ఉంటుంది. 48 గంటల తర్వాత వాడకానికి జీవామృతం సిద్ధమవుతుంది. అప్పటి నుంచి వారం రోజుల్లోగా ఉపయోగించాలి. ఎకరాకు 200 లీటర్ల జీవామృతాన్ని ప్రతీ 15 రోజులకోసారి సాగునీటితోపాటు వాడాలి. లేదా భూమిలో పదునుంటే నేరుగా చల్లాలి. జీవామృతాన్ని అన్ని పొలాల్లో వాడవచ్చు. పంటలపై పిచికారీ చేయొచ్చు.

తయారీకి కావాల్సిన పదార్థాలు (ఎకరాకు)

- 200 లీటర్ల నీళ్లు
- 10 కిలోల పశువుల (ఆవు, ఎద్దు, గేదెల) పేడ 4, 5 నుంచి 10 లీటర్ల పశువుల మూత్రం
- 1 నుంచి 4 కిలోల బెల్లం (నల్లబెల్లం శ్రేష్ఠమైనది) కిలో పప్పుధాన్యాల పిండి (ఉలవ, అలసంద, కంది, మినప, పెసర పిండి.. ఏదైనా కలిపి వాడొచ్చు)

పొలం గట్టు మట్టి.. పిడికెడు

- పంటలపై జీవామృతం పిచికారీ విధానం. మూడు నెలల్లో (60–90 రోజుల్లో) పూర్తయ్యే పంటలకు (ఎకరాకు)..

మొదటిసారి: (విత్తనం నాటిన నెలకు) 100 లీటర్ల నీటికి 5 లీటర్ల జీవామతం కలిపి పిచికారీ చేయాలి.

రెండోసారి: (21 రోజుల తర్వాత) 150 లీటర్ల నీటికి 10 లీటర్ల జీవామృతం కలిపి పిచికారీ చేయాలి.

మూడోసారి: (21 రోజుల తర్వాత) 200 లీటర్ల నీటికి 20 లీటర్ల 'నీమాస్త్రం'ను కలిపి చల్లాలి.

నాలుగోసారి: (గింజ ఏర్పడుతున్న దశలో) 200 లీటర్ల నీటిలో 5 లీటర్ల పుల్లమజ్జిగ కలిపి పిచికారి చేయాలి (ఈసారి జీవామృతం అక్కర్లేదు).

6 నెలల్లో (150 నుంచి 180 రోజుల్లో)

పూర్తయ్యే పంటలకు (ఎకరాకు)..

మొదటిసారి: (విత్తనం నాటిన నెలకు) 100 లీటర్ల నీటికి 5 లీటర్ల జీవామృతం కలిపి చల్లాలి.

రెండోసారి: (30 రోజుల తర్వాత) 150 లీటర్ల నీటికి 10 లీటర్ల జీవామృతం కలిపి పిచికారీ చేయాలి.

మూడోసారి: (30 రోజుల తర్వాత) 200 లీటర్ల 'నీమాస్త్రం'ను చల్లుకోవాలి.

నాలుగోసారి: (30 రోజుల తర్వాత) 200 లీటర్ల నీటిలో 20 లీటర్ల జీవామతం కలిపి పిచికారీ చేయాలి.

ఐదోసారి: (30 రోజుల తర్వాత) 200 లీటర్ల నీటిలో 20 లీటర్ల జీవామృతం కలిపి చల్లాలి.

ఆరోసారి: (గింజ ఏర్పడుతున్నప్పుడు) 200 లీటర్ల నీటిలో 6 లీటర్ల పుల్లమజ్జిగ కలిపి పిచికారీ చేయాలి.

ఈఎంటీ లక్ష్మణ్‌కు సన్మానం



సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్

భైంసాటౌన్: 108 అంబులెన్స్ ఈఎంటీ లక్ష్మణ్ పూజారిని మాజీ ఎమ్మెల్యే బి. నారాయణరావు పటేల్ శనివారం సన్మానించారు. ఇటీవల గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ వ్యక్తిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా సీపీఆర్ చేసి ప్రాణం కాపాడాడు. అలాగే రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన నేపథ్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే ముధోల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయానంద్ సైతం అభినందించారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మణచాంద: ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.సుమలతను బీఆర్ఎస్ మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు. మండల అధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి, నాయకులు భూమేష్, ముత్యం, మహేశ్, సాయి తదితరులు ఉన్నారు.



ఎస్సైని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆకాశంలో అద్భుతం..!

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే), రాచాపూర్ గ్రామాల మధ్యన శనివారం ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సాయంత్రం ఆకాశంలో మేఘాలు దగ్గరకు రావడంతో పక్షి తన రెక్కలు విప్పినట్లుగా కనిపించింది.



వైభవంగా పల్లకిసేవ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవరకోట ఆలయంలో స్వామి వారి పల్లకిసేవను శనివారం వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.